
# రిపబ్లిక్ హిందుస్థాన్
REPUBLICHINDUSTAN

ఆదిలాబాద్ | ఎడిటర్: రాథోడ్ రాజు | సంపుటి : 4 | సంచిక : 9 | గురువారం 9 జనవరి 2025 | పేజీలు : 04 | వెల 5-00

ADHILABAD | EDITOR : RATHOD RAJU | VOLUME : 4 | ISSUE : 9 | THURSDAY JANUARY 9 2025 | PEGES-04 | Rs:5.00


# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం





**స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి**

**త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**భద్రాద్రి :** రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ఉదయం ప్రజా భవన్ లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నాం. పెద్ద మొత్తంలో డబ్బులు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు.

మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించండి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుంది. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని, కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే అవకాశం స్పష్టంగా ఉందని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుంది. చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.

గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుంది. భూమి లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టల తో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయి వీటి పైన సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రధానమంత్రి పీఎం కూసుమ్ పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. టిజి రెడ్ కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడం మే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# ఆకలి సంగతి ఏంటీ...

**మెదక్ :** వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులు అర్థాకలి మధ్య చదువును కొనసా మెదక్ జిల్లా వ్యాప్తంగా 225 ఉన్నత పాఠశాలల్లో 10,389 మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. ప్రతీరోజు ఉదయం 8:15 గంటలకు ప్రత్యేక తరగతులు ప్రారంభమై సాయంత్రం 5:30 వరకు కొనసాగుతున్నాయి. ఉదయం 8 గంటల వరకే పాఠశా విద్యార్థులు చేరుకుంటున్నారు. గ్రామా నుంచి వేలాది మం విద్యార్థులు ఆయా పాఠశాలలకు పదవ తరగతి చదివేందుకు వస్తున్నారు. ఉదయం త్వరగా వెళ్లాల్సి ఉండటతో ఇంటి వద్ద ఏమీ తినకుండానే పాఠశా వస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలలో మధ్యా 12.30 గంటల వరకే మధ్యాహ్న భోజనం పూర్తి చేసుకుంటున్నారు. తిరిగి తరగతులకు హాజరుకావడం, సాయం 5.30 గంటల వరకు చదువులు కొనసాగించడంతో నీరసించిపోతున్నారు. ఉదయం, సాయం త్రం ఫలహారం లేకపోవడంతో చదువుపై శ్రద్ధ కనబర్చడం లేదని వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రత్యేక తరగతులకు గాను ఫలహారాన్ని అందించేవారు. అయితే ఏడాది నుంచి విద్యార్థులు ఫలహారానికి నోచుకోవడం లేదు. మరో 53 రోజుల్లో పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుండగా ఏకాగ్రత లోపించి అనుకున్న ఫలితాలను సాధించలేకపోతారనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే ప్రభుత్వం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిధులు మంజూరు చేయించి విద్యార్థులకు ఫలహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఫలహారం అందించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో జిల్లా కలెక్టరే తన నిధుల నుంచి ఒక్కో విద్యార్థికి



రూ.5 చొప్పున కేటాయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. తాజా సమాచారం ప్రకారం కలెక్టర్ వద్ద ఎలాంటి నిధులు లేవని, ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో ఖర్చయినట్లు సమాచారం. జిల్లాలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం ఫలహారం అందించేందుకు గాను ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చి విద్యార్థుల ఆకలిని తీర్చాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఉపాధ్యాయులు కోరుతున్నారు.పదవ తరగతి ప్రత్యేక తరగతుల కోసం ప్రతిరోజు ఉద 4 కిలో మీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నా. ఉదయం తొందరగా రావాల్సి ఉండటంతో ఇంట్లో తినకుండానే రావడంతో ఆకలితో చదువుకు ఆటంకం కలుగుతోంది. సాయంత్రం వరకు ఆకలిని తట్టు చదవాల్సి వస్తుంది. ఉదయం, సాయంత్రం ఫలహారం అందిస్తే బాగుంటుంది. ఉదయం నుంచి సాయం వరకు ప్రత్యేక తరగతులు ఉం డటం వలన అల గురవుతున్నాం. సా 4 గంటలకు అల్పా హారం ఉంటే బాగుంటుంది. చాలామంది గ్రామా నుంచి కాలినడకన వస్తున్నారు. మా అవస్థను అర్థం చేసుకొని దాతలు, అధికారులు అల్పాహారం అందించేలా చర్య తీసుకోవాలి.

## కోట్లాది మంది జీవితాలతో ముడిపడిన శాఖలు

**గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమం**

**ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క**

గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు రాష్ట్రంలో కోట్లాదిమంది జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఈ శాఖల ద్వారా మెరుగైన సేవలు రాష్ట్ర ప్రజలకు అందాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి సీతక్క అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో ఈ శాఖలకు సంబంధించి వారు పలు అంశాలను చర్చించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నతనంలోనే మంచి పోషక ఆహారాన్ని అందించడం ద్వారా వారికి ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. వారిపై పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని అన్నారు. జువైనల్ హోమ్స్ లోని పిల్లల మానసిక పరిపక్వతకు క్రీడలు దోహదం చేస్తాయి, ఇందుకుగాను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి స్పోర్ట్స్ కిడ్స్ అందిస్తామని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు తెలిపారు. స్పోర్ట్స్ కిట్స్ అందజేయాల్సిందిగా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డికి సమావేశం నుంచి సూచించారు. శిశు విహార్ లో ప్రస్తుతం ఉన్న శిశువుల సంఖ్య వారికి అందుతున్న సౌకర్యాలు, వైద్య సహాయం తదితర అంశాలపై మంత్రులు సమ్మె అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న మహిళా ప్రాంగణాల పరిస్థితి పైన డిప్యూటీ సీఎం, మంత్రి సీతక్క ఆరా తీశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నట్టు అధికారులు తెలియజేయడంతో వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద వ్యాపారాలకు పనికొచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులకు స్వల్పకాలిక శిక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ జెండర్ ల సేవలను ప్రస్తుతం హైదరాబాద్ ట్రాఫిక్ కూడళ్ళలో వినియోగిస్తున్నారు, ఈ ప్రయోగం విజయవంతం అయితే మండల కేంద్రాల్లోనూ ట్రాన్స్ జెండర్ ల సేవలు వినియోగిస్తామని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. దీంతోపాటు ట్రాన్స్ జెండర్ ల క్లినిక్ సెంటర్లు దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అందుబాటులో ఉన్నాయని మంత్రులు వివరించారు. కేంద్ర సౌజన్యంతో కొనసాగుతున్న పథకాలు, నిధుల విడుదల, భవిష్యత్తులో ఈ పథకాలకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ వర్శిటీలో గొడ్డు కారంతో లంచ్

## విద్యార్థినుల ఆందోళనలతో మార్పు...

**నల్గొండ :** పిల్లల చదవుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం.. అందరూ చదువుకోవాలన్న ఉద్దేశంతో నిర్బంధ విద్య అమలు చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కళాశాల విద్యార్థులకు కూడా కొన్ని రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నాయి. ఇక పేదలు కూడా ఉన్నత చదవులు చదువోకోవాలని ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తున్నాయి. ఇక యూనివర్సిటీల్లో చదువుకునే పిల్లలకే కేంద్రం యూసీసీ ద్వారా నిధులు అందిస్తోంది. భోజనంతోపాటు, చదువులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ వాటాగా సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో తెలంగాణలోని ఓ యూనివర్సిటీలో విద్యార్థులను ఖైదీలకన్నా అధ్వానంగా చూస్తున్నారు. గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు. విద్యార్థులు ఈ దృశ్యాలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.నల్గొండలోని మహాత్మాగాంధీ యూనిర్సిటీ యాజమాన్యం విద్యార్థులను ఖైదీల్లా చూస్తోంది. హాస్టళ్లలో ఉండే ఆడ పిల్లలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం గొడ్డుకారంతో పెడుతున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అయినా యాజమాన్యం స్పందిచండం లేదు. ఖైదీలకు కూడా ఇలా గొడ్డుకారంతో భోజనం పెట్టరని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారంతో భోజనం చేయలేక పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణవేణి హాస్టల్‌లోని విద్యార్థినులు భోజనం నిర్వాహకులతో గొడవకు దిగారు.రోజూ కారంతో టిఫిన్, భోజనం పెట్టడంపై యాజమాన్యం స్పందించకపోవడంతో విద్యార్థినులు నిర్వాహకులను నిలదీశారు. ఇలాంటి అన్నం ఎలా తినాలని ప్రశ్నించారు. మీ పిల్లలకు ఇలాగే పెడతారా అని నిలదీశారు. ప్రభుత్వాలు తమ కోసం కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నా తమకు ఎందుకు ఇలాంటి భోజనం పెడుతున్నారని ప్రశ్నించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.మహాత్మాగాంధీ యాజమాన్యం తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. విద్యార్థినులను పిల్లల్లా చూసుకోవాల్సిన యాజమాన్యం ఇలా గొడ్డుకారంతో భోజనం పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతున్నారు. నిర్వాహకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బన్సీలాల్ పేట్ స్కూలును

## హైస్కూలు చేసేందుకు కృషి

**సికింద్రాబాద్ :** వచ్చే విద్యా సంవత్సరం నుండి బన్సీలాల్ పేట డివిజన్ లోని మేకల మండి ప్రాథమికోన్నత పాఠశాల ను ఉన్నత పాఠశాల (హై స్కూల్) గా అప్ గ్రేడ్ చేయించేందుకు కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం మేకల మండి పాఠశాలలో 1.80 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను తలసాని అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీ ప్లస్ 2 విధానంలో 16 తరగతి గదుల నిర్మాణం చేపట్టగా, పనులు ముగింపు దశకు చేరుకున్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుతం 7 వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 614 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, అందుకు సహకరించాలని, అదనంగా మరో 6 తరగతి గదులు మంజూరు చేయించాలని స్కూల్ డెవెలప్మెంట్ కమిటీ సభ్యులు తలసానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ కు విద్య ఎంతో ప్రధానమని, వారికి బంగారు భవిష్యత్ ను అందించాలనే లక్ష్యంతోనే స్కూల్ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేస్తూ వస్తున్నానని గుర్తుచేశారు. 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన స్కూల్ లో విద్యార్థుల సంఖ్య నేడు 617 మందికి చేరుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమని చెప్పారు. ఈ స్కూల్ పరిసరాలలో ఉండే వారంతా నిరుపేదలేనని, వేలాది రూపాయలు చెల్లించి తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్స్ కు పంపించే స్థోమత లేదని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని స్కూల్ అభివృద్ధి లో భాగంగా 16 తరగతి గదుల నిర్మాణం కోసం సర్వ శిక్ష అభియాన్ నుండి 1.15 కోట్ల రూపాయలు మంజూరు చేయించానని, ఆ నిధులు సరిపోవని నా దృష్టికి తీసుకు రాగా తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి 65 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు వివరించారు. 7 వ తరగతి అనంతరం విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రాథమికోన్నత పాఠశాల ను హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి నిఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు.

# సంపాదకీయం

## జారుగుబల్లపై రూపాయి పతనం!

భారత బడా బూర్జువా వర్గం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశ సహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలి వేశా రు. దాని ఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్‌కి 85.7 రూపాయిలుగా ఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది. 1948 నుండి 1980 వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79 సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్న వ్యత్యాసం, పెద్ద నోట్ల రద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ -రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వ స్థానంలో ఉన్న భారత్‌కు 85% చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలు పెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి. అంతేకాకుండా ప్రయాణ ఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టివిలు, ల్యాప్ టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతి చేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏ దేశ పెత్తనం ఉంటుందో, ఆ దేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది. డాలర్ ఆధిపత్యం: చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974 లో సౌదీ అరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీ అరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని, దానికి బదులుగా సైనిక, ఆర్థిక సహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాను తన వ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి నుండి చమురు ఉత్పత్తి దేశాల్లో డాలర్లలోనే చమురు విక్రయం కొనసాగింది. ముడి చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగా పెరిగింది. ముడి చమురుకు అన్ని దేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది. అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది. డాలర్ గిరాకీ వల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దాని విలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరం కాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధం వలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురు తిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తే వాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతం ఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ మారకంలో ఆయా దేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీ రుణాలపై అసలు, వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగా మారుతుంది. ఆయా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది. అందువల్ల అమెరికా తనకు నచ్చిన దేశానికి కావాల్సినంతమేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింపచేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనం అమెరికాకు తోడ్పడుతుంది. అమెరికాకు ఆయా దేశాలు చేసే ఎగుమతులు కుదించుకుపోతే, ఆ దేశాల దగ్గర ఉన్న డాలర్ నిల్వలు తరిగిపోతాయి. ఫలితంగా ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు కాని ఇప్పటికే ఆ దేశాలు ఐఎంఎఫ్ లేదా ప్రపంచ బ్యాంకు దగ్గర పొందిన రుణాలు డాలర్లలోనే చెల్లించాల్సిన ఉంది. అప్పుడు డాలర్ల అవసరం ఆ దేశాలకు తప్పదు. ఆ విధంగా ఐఎంఎఫ్ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మద్దతుగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్లలోనే సాగాలనే నిబంధన లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్‌పై ఆధారపడటం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభం చేస్తుంది. అది అమెరికాకు ఇష్టం ఉండదు. బ్రిక్స్ ఏర్పాటు: వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, దక్షిణాఫ్రికా దేశాలు బ్రిక్స్ దేశాల కూటమిగా ఏర్పడ్డాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ ఎమిరేట్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా 30 దేశాలు బ్రిక్స్‌లో చేరాలనే ఆలోచన చేస్తున్నాయి. ఐఎంఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ దీని ఏర్పాటు లక్ష్యం. అంతర్జాతీయ వాణిజ్యం ఆయా దేశాల కరెన్సీలలోనే జరగాలనే డిమాండ్ ను బ్రిక్స్ ముందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాల జనాభా 310 కోట్లకు పైగా ఉంది. ఇది ప్రపంచ జనాభాలో 41%, ప్రపంచ వ్యవసాయంలో 45% కలిగి ఉన్నాయి. బ్రిక్స్ దేశాలు, తమ ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోని, సమానత్వంతో కూడిన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా నిర్వహించు కుంటాయి. అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా ప్రత్యేక అభివృద్ధి బ్యాంకును నెలకొల్పేందుకు బ్రిక్స్ దేశాలు సన్నద్ధమవుతున్నాయి. వీటి ప్రయోజనాలు వీటికి ఉన్నా, అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగితే ప్రపంచ వాణిజ్యంలో మార్పులు సంభవిస్తాయి. డాలర్ ఆధిపత్యాన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కి ప్రత్యామ్నాయంగా ఆ దేశాల కరెన్సీలోనే చెల్లింపులు జరపాలని నిర్ణయించాయి. బ్రిక్స్ వేదికగా సమర శంఖం పూరించాయి. పెట్రోల్ విక్రయంలో డాలర్‌కు సౌదీ అరేబియా స్వస్తి చెప్పటం బ్రిక్స్‌కి బలం చేకూరుతుంది. ఇక నుంచి డాలర్లతో పాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఇయు)యూరో, జపానీస్ యెన్ ల లోను చెల్లింపులు స్వీకరిస్తామని చెప్పింది. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు కలిసి ఉమ్మడి కరెన్సీ వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి. ఆ కరెన్సీ స్వభావం గురించి ఉమ్మడి అభిప్రాయ రావాల్సి ఉంది. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వాణిజ్యం జరగాలన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, అలా వ్యతిరేకిస్తున్న దేశాలను బెదిరించటానికి ట్రంప్ పూనుకున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై 100% సుంకాన్ని విధిస్తామనే బెదిరింపులు చేస్తున్నాడు. ట్రంప్ బెదిరించగానే ప్రపంచంలో మూడవ అతిపెద్ద 'ఆర్థిక' వ్యవస్థగా చెప్పుకుంటున్న భారతదేశం డాలర్ రహిత వాణిజ్యం పట్ల ఆసక్తిలేదని ప్రకటించటం అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ లొంగుబాటును వెల్లడి చేస్తున్నది.

# బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యాబాంధవి



మానవ హక్కులంటే, సమాజంలోని అన్ని వర్గాల హక్కులని, ముఖ్యంగా బలహీన వర్గాలు, మహిళలు, పిల్లల హక్కులని, వాటి సాధనకు అక్షరమే ఆయుధమని నమ్మిన సమాజ సేవకురాలు, ఆధునిక భారత మొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్ . సావిత్రీబాయి పూలేతో కలిసి అణగారిన వర్గాల మహిళలు, పిల్లలకు అక్షరజ్ఞానం ప్రసాదించిన విద్యాదాత. ఆధునిక భారత విద్యారంగానికి మార్గదర్శకురాలు. మనువాద, అగ్రవర్ణ భావజాలికులు సంప్రదాయం పేరుతో శూద్రులకు విద్యను నిరాకరించినప్పుడు, దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాల మహిళలు, పిల్లల విద్యాహక్కు కోసం గళమెత్తిన ధీరవనిత. సావిత్రీబాయి, జ్యోతిరావు పూలేతో కలిసి విద్యాభివృద్ధికి పాటుపడిన త్యాగమయి. జ్యోతిరావ్ పూలే నేతృత్వంలోని సత్యశోధక్ (సత్యాన్వేషణ) ఉద్యమంలో అగ్ర భాగస్వామి. 1848 లో దళితపిల్లలు, మహిళల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడానికి ప్రయత్నించినప్పుడు, 'మత వ్యతిరేక చర్య'గా పేర్కొంటూ జ్యోతిరావు, సావిత్రీబాయి పూలేలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఇంటినుండేగాక, గ్రామం నుండి కూడా బహిష్కరించినప్పుడు, ఫాతిమా షేక్ , ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ వారికి సహాయం చేసి ఆదుకున్నారు. పూలే దంపతులు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే ఉంటూ, అదే ఇంట్లో పాఠశాల నడిపేవారు. పూలే ఆలోచనల నుండి ప్రేరణ పొందిన ఉస్మాన్ తన సోదరిని సావిత్రీబాయితోపాటు, ఉపాధ్యాయురాలిగా శిక్షణ ఇప్పించాడు. సావిత్రీబాయితో పాటు, ఫాతిమా కూడా నాటి అగ్రవర్ణ, ఆధిపత్య వర్గాల నుండి సామాజిక పరంగా అనేక అవమానాలను, కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. ఎందుకంటే వారుదుర్మార్గమైన బ్రాహ్మణీయ కుల వ్యవస్థ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడుతున్నందున, ఆధిపత్య కులాలకు చెందిన వారు సహించలేక పోయారు. వారిపై రాళ్లురువ్వడం, ఆవు పేడచల్లడంతో పాటు హింసాత్మకంగా వ్యవహరించారు. ముఖ్యంగా బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నందుకు మతోన్మాదులు ఆమెను తీవ్రంగా వ్యతిరేకించారు. ఫాతిమా, సావిత్రిబాయి కలిసి పూలే ప్రారంభించిన విద్యా సంస్థలను ముందుండి నడిపారు. విద్యాభివృద్ధి జరగాలంటే విద్యాసంస్థలు సజీవంగా ఉండాలి. వాటిని నిర్మూలించడానికి మనువాదులు విశ్వప్రయత్నాలు చేసినప్పుడు వాటిని కాపాడుకోడానికి ఫాతిమా చేసిన కృషి అనుపమానమైనది. అడుగడుగునా పూలే దంపతులకు అండగా నిలిచి, సత్యశోధక్ ఉద్యమంలో ముఖ్య భూమిక నిర్వహించారు. సావిత్రీబాయి తన భర్తజ్యోతిరావుపూలేకి రాసిన లేఖలలో, ఫాతిమా షేక్ పై సావిత్రి కురిపించిన ప్రేమాభిమానాలు మనకు కనిపిస్తాయి. పూలే దంపతులు నిర్వహించే కార్యక్రమాలకు ఫాతిమా షేక్ అందించిన సహాయ సహకారాలు అనుపమానమైనవి. ఫాతిమా నాకు ఎంతగానో సహకరించింది. ఆమె సహకారంతోనే నేను ఇన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను. అని రాశారు సావిత్రి. సుదీర్ఘ పోరాటం తర్వాత సావిత్రీబాయి ఈనాడు తగిన గుర్తింపును పొందగలిగినా, ఫాతిమా షేక్ ఇంకా విస్మృత విద్యావేత్తగానే మిగిలిపోయారు. దేశ చరిత్ర నుండి విస్మరించబడి, తగిన గుర్తింపు లేని వారి జాబితాలోనే ఉండిపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడుగు, బలహీన వర్గాల మహిళల హక్కులకోసం పోరాడిన అతికొద్ది మందిలో ఆమె ప్రథమురాలు. దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు, పిల్లలకు విద్య నేర్పించాలని ఆమె ఎంతగానో తపన పడ్డారు. ముస్లిం మైనారిటీలు అనుసరించే ఇస్లాం ధర్మం స్త్రీ విద్యను వ్యతిరేకించనప్పటికీ, ఇస్లాం తెలియని ముస్లింల నుండి, అగ్రకుల హిందువులనుండి ఆమె తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆధిపత్య భావజాలం కల సమాజంలో ఫాతిమా షేక్ ఒక ముస్లిం మహిళగా అనేక ఆటుపోట్లు, అవమానాలు చవిచూశారు. అయినా సరే, అకుంఠిత దీక్షతో ఆమె దళితులు, ఆదివాసీలు, స్త్రీలు, పిల్లల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి, ఆధునిక భారతదేశంలోని మొదటి ముస్లిం మహిళా విద్యావేత్తగా చరిత్రలో నిలిచి పోయారు. 2014లో, మహారాష్ట్ర ప్రభుత్వం ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ , జాకీర్ హుసేన్, అబ్దుల్ కలామ్ లతోపాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్నీ తమ రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో పొందుపరిచింది. 2021లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకూడా ఎనిమిదవ తరగతి టెక్స్ట్ బుక్ లో ఫాతిమా షేక్ పై పాఠాన్ని ప్రవేశపెట్టి ఆమె సేవలకు తగిన గుర్తింపును కలిగించింది. అక్షరాన్ని అమితంగా ప్రేమించి, అణగారిన వర్గాలను, ముఖ్యంగా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి, అహర్నిశలూ అలుపెరుగని పోరు సలిపిన ఫాతిమా షేక్ విస్మృత చరిత్రను వెలికి తీసి భావితరాలకు అందించవలసిన చారిత్రక అవసరం నేటితరం మేధావులపై ఎంతైనాఉంది. ఆదిశగా గట్టి ప్రయత్నం చేస్తున్న ప్రముఖ చరిత్రకారుడు నశీర్ అహ్మద్ కు అభినందనలు.

# తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు



తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి. 1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావుబీ ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు. తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదుబీ అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యం లోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో – తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు. జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు. అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు. 1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు. జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది. తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం, 1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి. అలా తొలి దశ ఉద్యమం నీరు గారి పోవడం తెలిసిందే... 2001 ఏప్రిల్ 27న కేసిఆర్ నేతృత్వంలోని తెరాస ఉద్యమ పార్టీ ఏర్పాటు కావడం, సుదీర్ఘ మలి ఉద్యమ పోరాటాల, అత్మ బలిదానాల ఫలితంగా, భారత ప్రభుత్వం 2 జూన్ 2014 ను తెలంగాణ నిర్మాణ దినంగా ప్రకటించడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగడం అందరికీ తెలిసిందే.


# స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని అనుమతి ఇచ్చారు

**తిరువనంతపురం:** ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.
ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ..



ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మార్క్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

## హెచ్ఎంపీవీ వైరస్




దేశంలో హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్తీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# కనిష్టానికి వృద్ధిరేటు

**ముంబై :** భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది.. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది.. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందంజలోనే ఉంది.. ఈ క్రమంలో ఎఫ్ వై25లో భారతదేశ జీడీపీ వృద్ధి 4 సంవత్సరాల కనిష్ట స్థాయి 6.4%కి చేరుకోవచ్చని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మొదటి ముందస్తు అంచనాల ప్రకారం.. మందగమనం, ఆర్థిక కార్యకలాపాల గురించి హైలైట్ చేస్తుంది.. భారత ఆర్థిక వ్యవస్థ నాలుగేళ్లలో అత్యంత నెమ్మదిగా వృద్ధి చెందగలదని సూచిస్తుంది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం.. భారతదేశ ఉఆఖ వృద్ధి ఎఫ్ వై24లో 8.2% నుంచి ఎఫ్ వై25లో 6.4%కి తగ్గుతుందని అంచనా వేసింది..మొదటి ముందస్తు అంచనాల మందగమనం ఆర్థిక కార్యకలాపాల మరింత పతనాన్ని హైలైట్ చేస్తుంది.. ఆర్థిక వ్యవస్థ గత నాలుగు సంవత్సరాలతో పోలిస్తే అత్యంత నెమ్మదిగా వృద్ధి చెందగలదని సూచిస్తుంది.“ఎఫ్ వై 2023-24 కోసం జీడీపీ తాత్కాలిక అంచనా లో 8.2% వృద్ధి రేటుతో పోలిస్తే ఎఫ్ వై 2024-25లో వాస్తవ జీడీపీ 6.4% పెరుగుతుందని అంచనా వేసింది.. నామమాత్ర జీడీపీ 9.7% వృద్ధి రేటును సాధించింది. ఎఫ్ వై 2024-25 ఈజలో 9.6% వృద్ధి రేటు కంటే ఎక్కువ 2023-24” అని ఔూా డేటా పేర్కొంది.మార్చి 2025తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి



ఇటీవలి రిజర్వ్ బ్యాంక్ అంచనా 6.6% కంటే ఈ అంచనా తక్కువగా ఉంది.. ముందస్తు అంచనా, బడ్జెట్ లెక్కల్లో కీలక పాత్ర పోషిస్తుంది.. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన 5.4% జీడీపీ వృద్ధికి షాక్ ఇచ్చింది. ఈ ఆశ్చర్యకరమైన సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దాని వృద్ధి అంచనాను మునుపటి 7.2% నుంచి.. 6.6%కి తగ్గిస్తూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రకటన విడుదల చేసింది..స్థిర ధరల వద్ద వాస్తవ జిడిపి ఎఫ్ వై24లో రూ.173.82 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై25లో రూ.184.88 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా. ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్రపు ఉఆఖ గత ఏడాది రూ.295.36 లక్షల కోట్లతో పోలిస్తే 9.7% వృద్ధి చెంది రూ.324.11 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా.రియల్ గ్రాస్ వాల్యూ యాడెడ్ (ఉఎం) 6.4% వద్ద పెరుగుతుందని అంచనా వేయగా.. ఇది ఎఫ్ వై 24లో 7.2% నుంచి క్షీణత ఉండవచ్చు..మందగమనం ఉన్నప్పటికీ, కీలక రంగాలు ఆశాజనకంగా ఉన్నాయి. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు ఎఫ్ వై 24లో 1.4% నుంచి 3.8% పెరుగుతాయని అంచనా వేశారు.. నిర్మాణ రంగం 8.6%, ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు 7.3% వృద్ధి చెందుతుందని అంచనా వేశారు.గృహ వ్యయానికి కీలక సూచిక అయిన ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (ఖఈఅఇ) ఎఫ్ వై 24లో 4.0%తో పోలిస్తే ఎఫ్ వై 25లో 7.3% పెరుగుతుందని అంచనా వేశారు. ఇంతలో, ప్రభుత్వ తుది వినియోగ వ్యయం (ఉఈఅఇ) గత ఆర్థిక సంవత్సరం 2.5% నుంచి 4.1% వృద్ధి రేటుతో పుంజుకోవచ్చని అంచనా వేశారు. వృద్ధి క్షీణించినప్పటికీ, కొన్ని రంగాలు స్థితిస్థాపకంగా ఉండే అవకాశం ఉందని ఈ అంచనాలు పేర్కొంటున్నాయి.. మొత్తం వృద్ధి మందగించినప్పటికీ ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతాయని ఈ డేటా చెబుతోంది.

## ‘ఆప్’కు మమత మద్దతు.. కృతజ్ఞతలు చెప్పిన కేజ్రీ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కి మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ మద్దతు తెలిపింది. ఇప్పటికే ఆప్‌కు మద్దతిస్తున్నట్టు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించిన నేపథ్యంలో టీఎంసీ మద్దతు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో మమతాబెనర్జీకి కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. ”ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిస్తున్నట్టు టీఎంసీ ప్రకటించింది. మమతా దీదీకి వ్యక్తిగతంగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. థాంక్యూ దీదీ.. మేము బాగున్నప్పుడు, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడూ కూడా మీరు మా వెన్నంటే ఉండి ఆశీర్వదిస్తున్నారు” అని కేజ్రీవాల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆయన ట్వీట్‌కు టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ వెంటనే ‘ఎక్స్’లో స్పందించారు. మేము మీకు బాసటగా ఉంటామంటూ ఆ ట్వీట్‌లో ఒబ్రెయిన్ హామీ ఇచ్చారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తుపెట్టుకున్నప్పటికీ ఆ తర్వాత జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేసింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు ఆప్ మొదట్లోనే ప్రకటించింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## మహిళల శరీరంపై కామెంట్ చేసినా.. లైంగిక వేధింపే అవుతుంది: కేరళ హైకోర్టు




**కొచ్చి:** మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.

## రూ.25 లక్షల ఆరోగ్య బీమా.. కాంగ్రెస్ మరో స్కీమ్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించడంతో ప్రధాన పార్టీలన్నీ హామీలతో దూసుకు వెళ్తున్నాయి. ప్రధానంగా మహిళలకు ఆర్థిక సహాయం, వృద్ధులకు ఉచిత ఆరోగ్యం స్కీమ్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ‘జీవన్ రక్షా యోజన’ స్కీమ్‌ను బుధవారంనాడు ప్రారంభించింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తే ఈ పథకం కింద రూ.25 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన రెండో వాగ్దానమిది. జనవరి 6న ‘ప్యారీ దీదీ యోజన’ను ఆ పార్టీ ప్రారంభించింది. ఈ పథకం కింద ఢిల్లీలోని మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. తాజాగా రెండో స్కీను ప్రకటిస్తూ, అధికారంలోకి రాగానే రెండు పథకాలను అమలు చేస్తామని తెలిపింది.




రూ.25 లక్షల ఆరోగ్య బీమా

జీవన్ రక్షా యోజన పథకాన్ని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రారంభిస్తూ, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఈ పథకాన్ని చేర్చాలని పార్టీ నిర్ణయించిందని అన్నారు. ఈ పథకం కింద రూ.25 లక్షల వరకూ ఆరోగ్య బీమా కల్పిస్తామని, రాజస్థాన్‌లోనూ ఇదే తరహా పథకాన్ని తాము ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం కింద ప్రజలందరికీ రూ.25 లక్షల వరకూ ఉచిత ఆరోగ్య చికిత్స అందిస్తామని, దీనికి ఎలాంటి షరతులు, ఆంక్షలు ఉండవని చెప్పారు. రాజస్థాన్‌లోని ‘చిరంజీవి యోజన’ తరహాలో రూపొందించిన పథకం ఇదని, రాజస్థాన్‌లో ఆరోగ్య హక్కు చట్టం తెచ్చామని తెలిపారు. ఇదొక విప్లవాత్మక పథకమని అన్నారు. జీవన్ రక్షా యోచన పథకాన్ని ఇక్కడ కూడా ప్రారంభించేందుకు తనను పిలవడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీలో ఇదొక ‘గేమ్ ఛేంజర్’ స్కీమ్ అని, ప్రజల వద్దకు ఈ పథకాన్ని అందరూ తీసుకెళ్లాలని కోరారు.

అసెంబ్లీ ఎన్నికలు 2025

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలను జనవరి 7న ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5న పోలింగ్, ఫిబ్రవరి 8న కౌంటింగ్ ఉంటుంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 అసెంబ్లీ స్థానాలకు 62 సీట్లను ఆప్ గెలుచుకోగా, బీజేపీ 8 సీట్లు దక్కించుకుంది. ఆప్‌కు 53.57 శాతం ఓట్లు పోలవ్వగా, బీజేపీ 38.51 శాతం ఓట్లు కైవసం చేసుకుంది.

## రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాద భీమా


రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందేలా చూడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఈ పథకం కింద రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యాన్ని పొందవచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



ప్రకటించారు. మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఈ పథకం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగిన 7 రోజుల దాకా రూ.1.5 లక్షల వరకు వైద్యాన్ని పొందే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. అన్ని రకాల రోడ్లపై మోటారు వాహనాల కారణంగా జరిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుందని గడ్కరీ వివరించారు. రోడ్డు ప్రమాదం తర్వాత బాధితులకు అత్యంత కీలకమైన ‘గోల్డెన్ అవర్’ సమయంలో వైద్య సహాయాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) ఈ స్కీమ్‌ను అమలు చేస్తుందని తెలిపారు. పోలీసులు, హాస్పిటల్స్, ప్రభుత్వ వైద్య సంస్థల సహకారం తీసుకోనున్నట్టు గడ్కరీ వెల్లడించారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఈ-డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈఏడీఆర్) అప్లికేషన్, ఎన్‌హెచ్‌ఏ ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఈ మూడింటితో అనుసంధానించిన ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ పథకం కార్యకలాపాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ పథకం పైలట్ ప్రాజెక్టు 2024 మార్చి 14న చండీగఢ్‌లో ప్రారంభమైందని, ఆ తర్వాత ఆరు ఇతర రాష్ట్రాలకు విస్తరించామని గడ్కరీ వెల్లడించారు. దేశంలో ఏకంగా 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# ఆ పేరుకు కళంకం తేవడం నాకు ఇష్టం లేదు : తమిళనాడు సీఎం

అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ అంశాన్ని అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికి అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు. ‘సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించదల్చుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారు చేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు. విద్యార్థినిపై లైంగిక దాడి కరమైన చర్య’ అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ‘సభలోని సభ్యులంతా లైంగిక దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప మిగతా అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే’ అని స్టాలిన్




ఆరోపించారు. అన్నా యూనివర్సిటీలో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనుకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు. ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.



## ఆ సన్నివేశాలు తొలగించండి..
## కోర్టును ఆశ్రయించిన నటి రమ్య

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా  రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది. ట్రైలర్‌తోపాటు సినిమాలోని పుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య  ఆరోపించింది. సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్.



# ఆ సన్నివేశాలు తొలగించండి
## కోర్టును ఆశ్రయించిన నటి రమ్య

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా  రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది. ట్రైలర్‌తోపాటు సినిమాలోని పుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య ఆరోపించింది. సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్. మరి రమ్య వ్యవహారంపై నిర్మాతలు ఎలా స్పందిస్తారనేది తెలియాల్సి ఉంది.



# శర్వానంద్ కోసం నందమూరి, కొణిదెల హీరోలు

హిట్టు ఫ్లాప్‌లు సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు టాలీవుడ్ నటుడు శర్వానంద్. గతేడాది మనమే అంటూ వచ్చి విజయాన్ని అందుకున్నాడు. అయితే ఈ నటుడు ప్రధాన పాత్రలో వస్తున్న తాజా ప్రాజెక్ట్ శర్వా 37. 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. వారిలో ఒకరు సంయుక్త కాగా మరొకరు యంగ్ బ్యూటీ సాక్షి వైద్య. ఇప్పటికే ఈ సినిమా నుంచి శర్వానంద్ తో పాటు సాక్షి వైద్య ఫస్ట్ లుక్స్ రిలీజ్ అయ్యాయి. తాజాగా ఈ మూవీ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ టైటిల్ లాంచ్ కోసం నందమూరి హీరోతో పాటు కొణిదెల హీరో ముఖ్య అతిథులుగా రానున్నట్లు చిత్రబృందం తెలిపింది. అయితే వారెవరు అనేది తెలియాలంటే జనవరి 14 వరకు వెయిట్ చేయాల్సిందే. ఈ మూవీకి 'నారీ నారీ నడుమ మురారి' అనే టైటిల్ ఫిక్స్ అయినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. గతంలో ఇదే పేరుతో బాలయ్య ఓ సినిమా చేశారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.



# బెల్లంకొండ శ్రీనివాస్ సాహస గాథ

టాలీవుడ్ యాక్టర్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ యంగ్ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి %దీూా%12. లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ మిస్టిక్ థ్రిల్లర్‌గా వస్తుంది. ఇటీవలే బెల్లంకొండ కొండపైన అటవీ ప్రాంతంలో గాలులు, మంటల మధ్య రైడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లుక్ ఒకటి విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోనువ విడుదల చేశారు. కొండలు, అటవీ ప్రాంతం విజువల్స్‌తో మొదలైంది ట్రైలర్. ఓ వైపు ఆలయంపై ఇంధనం చల్లుతున్న సన్నివేశాలు, గర్జిస్తున్న సింహం.. మరోవైపు బెల్లంకొండ బైక్‌పై వాటిని నియంత్రించేందుకు వస్తున్న విజువల్స్‌తో గూస్‌బంప్స్ తెప్పించేలా సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. దైవత్వంలో పాతుకుపోయిన, సాహసంతో కూడిన కథ అంటూ విడుదల చేసిన వీడియో నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం, బ్యాక్ గ్రౌండ్ మెయిన్ హైలెట్‌గా నిలువబోతున్నట్టు విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి.ఈ మూవీలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా..ఇప్పటికే లాంచ్ చేసిన సంయుక్తా మీనన్ స్టైలిష్, ట్రెండీ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. సంయుక్తా మీనన్ ఇందులో సమీర పాత్రలో నటిస్తోంది. ఈ మూవీకి దాశరథి శివేంద్ర సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు.

Printed , Published , Edited and Owned by Rathod Raju , Printed at Jal Bhavani Printing Press (Individual EDITOR And owner of printing press ) ,
H.No. 2-42 , Village : Jamidi Mdi . Ichoda Dist . Adilabad . , State : Telangana , Pin code - 504 307 ( T.S. ) , RNI Reg.No: TELTEL/2021/83468 EDITOR : RATHOD RAJU ,
Contact Numbers : 9908940762 , 8985614333 . Email : rhdaily.in@gmail.com .web : www.republichindustan.com